క్లుప్తంగా

రీ సర్వేకు సహకరించాలి


రీ సర్వే పనులు పరిశీలిస్తున్న తహసీల్దార్

పుల్లలచెరువు: ప్రస్తుతం మండలంలోని పలు గ్రామాల్లో జరుగుతున్న రీ సర్వేకు రైతులు సహకరించాలని తహసీల్దార్ కె.వెంకటేశ్వర రావు కోరారు. బుధవారం ఆయన రాచకొండ పంచాయతీలో జరుగుతున్న రీ సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు, సిబ్బందితో మాట్లాడుతూ ప్రభుత్వ నియమాలను అనుసరించి రీ సర్వే చేయాలని, రైతులు తమ పొలాలకు సంబంధించిన అన్ని పత్రాలను చూపించి ఇబ్బంది లేకుండా చూసుకోవాలన్నారు. రీ సర్వే సిబ్బంది కూడా రైతులకు సరైన సమాధానం చెబుతూ ఎటువంటి ఇబ్బంది లేకుండా సక్రమంగా సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు.

ఎన్నికల హామీలను నెరవేర్చని ప్రభుత్వం

త్రిపురాంతకం: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను రాష్ట్రంలో అధికారంలో ఉన్న ప్రభుత్వం అమలు చేయుటలో విఫలమైందని సీపీఐ డిమాండ్ చేసింది. త్రిపురాంతకంలో బుధవారం సీపీఐ మండల మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమయ్యాయని విమర్శించారు. ప్రజా సమస్యలపై సీపీఐ నిరంతరం పోరాటం చేస్తోందన్నారు. పార్టీ నాయకులు డి.శ్రీనివాస్, బాణాల రామయ్య, చెన్నయ్య, కృష్ణగౌడ్, మల్లికార్జున్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పాడి రైతులకు బోనస్ పంపిణీ


బోనస్ అందుకుంటున్న పాడి రైతులు

తాళ్లూరు: మండలంలోని బెల్లంకొండవారిపాలెంలో బుధవారం కృష్ణ మిల్క్ యూనియన్, విజయా డైరీ జనరల్ మేనేజర్ అవినాష్ ఆధ్వర్యంలో పాడి రైతులకు బోనస్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024 డిసెంబర్ నుంచి 2025 మార్చి వరకు 4 నెలలకు సంబంధించి పాడి రైతులకు బోనస్ పంపిణీ చేసినట్లు చెప్పారు. ప్రతి రైతు పాడి పరిశ్రమపై అవగాహన కలిగి ఉండాలని, తద్వారా పాల ఉత్పత్తులతో అధిక లాభాలు పొందొచ్చన్నారు. విజయా డైరీ మేనేజర్ హెచ్ దిలీప్‌కుమార్, సంఘం అధ్యక్షుడు పోశం రమణారెడ్డి, పాడి రైతులు పాల్గొన్నారు.

మీజిల్స్ రుబెల్లా వ్యాక్సిన్ వినియోగించుకోవాలి

తాళ్లూరు: ఒకటిన్నర ఏడాది కలిగిన పిల్లలకు మీజిల్స్ రుబెల్లా (ఆటలమ్మ, నూగులమ్మ) వ్యాక్సిన్ ఈ నెల 26వ తేదీ నుంచి 3 విడతల్లో వేస్తున్నట్లు డాక్టర్లు మౌనిక, శ్రీకాంత్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తూర్పు గంగవరం ప్రైమరీ హెల్త్ సెంటర్ పరిధిలోని చిన్న పిల్లలకు మే 26 నుంచి 31 వరకు, జూన్ 23 నుంచి 26 వరకు, జూలై 21 నుంచి 26వ తేదీ వరకు వ్యాక్సిన్‌పై స్పెషల్ డ్రైవ్ చేయనున్నట్లు పేర్కొన్నారు. మీజిల్స్ రుబెల్లా వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, చిన్నారులకు తప్పనిసరిగా వ్యాక్సిన్ వేయించాలని చెప్పారు. హెచ్ఈఓ కె.చంద్రశేఖర్‌బాబు, పీహెచ్ఎన్ ఎంపీ రమణమ్మ, వి.సుశీల పాల్గొన్నారు

నేడు హనుమాన్ జయంతి



తాళ్లూరు: మండలంలోని తూర్పు గంగవరం ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానంలో గురువారం హనుమాన్ జయంతి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు పాల్గొని పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు. అనంతరం అన్నదానం చేయనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ఏపీఈఏపీ సెట్ ప్రారంభం

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణంలో ఏపీఈఏపీ సెట్ పరీక్షలు(ఇంజనీరింగ్ స్ట్రీమ్) స్థానిక కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం ప్రారంభమయ్యాయి. జేఎన్‌టీయూ కాకినాడ ఆధ్వర్యంలో టీసీఎస్ సాంకేతిక సహకారంతో ఈ పరీక్షలు నిర్వహించారు. మొత్తం 200 మంది విద్యార్థులకుగాను 195 మంది హాజరయ్యారు. ప్రిన్సిపాల్, కేంద్ర నోడల్ అధికారి పర్యవేక్షణలో పరీక్షలు నిర్వహించారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

మార్కాపురం: మార్కాపురం మండలం గజ్జలకొండ సెక్టార్ పరిధిలోని రాయవరం అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం యోగా డే నిర్వహించారు. ఈ సందర్భంగా మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ ఆర్.నాగేంద్రరెడ్డి యోగా ప్రాధాన్యతను తల్లులు, చిన్నారులకు వివరించారు. రోజూ గంట సేపు యోగా చేయాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

బర్లీ పొగాకు ధరలు పతనం


పొగాకు బేళ్లు వెనక్కు తీసుకెళ్తున్న రైతులు


సిబ్బందితో వాగ్వాదానికి దిగిన రైతులు

- పొగాకు బేళ్లు వెనక్కి పంపుతున్న వైనం
- రైతులకు సమాధానం కూడా చెప్పని జీపీఐ అధికారులు

ముండ్లమూరు (కురిచేడు): బర్లీ పొగాకుకు ధరాఘాతం ఏర్పడింది. ఒకటికి పదిసార్లు రైతుల ఇళ్లకు వెళ్లి పొగాకు పంట సాగు చేయాలని చెప్పిన జీపీఐ సిబ్బంది.. నేడు పంటను కొనుగోలు చేయకుండా వెనక్కు పంపుతూ రైతులను ముప్పతిప్పలు పెడుతున్నారు. బుధవారం జీపీఐ పొగాకు కొనుగోలు కేంద్రానికి పల్నాడు జిల్లా నూజెండ్ల మండలం జడ్డావారిపాలెం నుంచి రైతులు 150 పొగాకు బేళ్లు తీసుకొచ్చారు. వాటిల్లో 50 బేళ్లు వెనక్కు పంపడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బర్లీ పొగాకు సాగుకు ముందే కంపెనీ అధికారులు గ్రామాల్లో సమావేశాలు ఏర్పాటు చేసి ఎంత ధరకు కొనుగోలు చేస్తారో కూడా ముందే తెలియజేశారు. దీన్ని నమ్మి రైతులు అందినకాడల్లా అప్పులు చేసి రాత్రింబవళ్లు ఎండనక వాననక కష్టపడి పండించిన పంట తీరా అమ్మకానికి వచ్చే సరికి సిబ్బంది పొమ్మనకుండా పొగపెడుతున్నారని రైతులు వాపోతున్నారు. ఎగుమతి తగ్గగానే రైతులు ఇష్టానుసారం సాగు చేశారని, అనుమతి ఇచ్చిన దానికన్నా రెండింతలు సాగు చేశారని సాకులు చెప్పటం పొగాకు కంపెనీ వారికి ఆనవాయితీగా మారింది. వ్యాపారం మార్పులు జరిగినంత తేలికగా రైతుల కష్టంలో జరగదు. ఏడాది కాలం కష్టపడితేనే వారికి పంట చేతికి వచ్చేదని తెలిసినా వారిని ఇబ్బందుల పాలుచేసి కంపెనీ లాభాలు చూసుకోవటం పరిపాటైంది. ఒకే ఏడాదిలో సాగు చేయమన్న అధికారులు కొనుగోలు కేంద్రం వద్దకు రైతులు పొగాకు తెచ్చేసరికి పనికి రాకుండా పోయిందా? అంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతులు పొగాకు నాటినప్పటి నుంచి చివరకు బేళ్లు కట్టి లారీకి ఎక్కించే వరకు ప్రతి సందర్భంలో సిబ్బంది దగ్గర ఉండి పర్యవేక్షిస్తుంటారు. ఇంటి వద్ద అనుమతిచ్చిన సిబ్బంది లారీకి బేళ్లు ఎత్తిన తర్వాత అక్కడే ఆగిపోతాడు. రైతు పరిస్థితి అక్కడ అయోమయంలో పడుతుంది. కొనుగోలు కేంద్రం వద్ద ఉన్న సిబ్బంది తన ఇష్టారీతిన తక్కువ ధరలు వేసి కొన్ని బేళ్లను చెప్పకుండా రిటర్న్ రాసి వెళ్లిపోతుంటారు. రైతులు ఏం మాట్లాడలేక, మాట్లాడితే మిగతా పొగాకు కొనరేమో అనే భయంతో కళ్లలో నీరు కుక్కుకుని ముఖానికి టవలు అడ్డుపెట్టుకుని వెళ్తుంటారు. ఒక్కో రైతు పొగాకు బేళ్లు కొనుగోలు కేంద్రానికి తెచ్చి వెనక్కు తీసుకెళ్లి తిరిగి మళ్లీ తేవాలంటే అదనంగా రూ.500 ఖర్చు అవుతుందని, దీంతో పాటు పొగాకులో జిగురు పోయి తూకం తగ్గుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రైతులకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

సమాధానం కూడా చెప్పడం లేదు:



ఇళ్ల వద్ద సూపర్‌వైజర్లు చూసి పంపిన పొగాకు బేళ్లు కొనుగోలు కేంద్రానికి వచ్చే సరికి పనికి రాకుండా పోతున్నాయా? ఒక్కరు కూడా సమాధానం చెప్పటం లేదు. ఇష్టమైతే ఇవ్వండి లేకుంటే తీసుకెళ్లండి అన్నట్లు వ్యవహరిస్తున్నారు. ఎందుకు బేళ్లు వెనక్కు పంపుతున్నారో సమాధానం కూడా చెప్పడం లేదు. పొగాకు బేళ్లలో ఉన్న లోపం చూపాలి. బేళ్లు బాగున్నా వెనక్కు పంపుతున్నారు.
– బాలకృష్ణ, రైతు

రూ.9 వేలే వేస్తున్నారు



ముందుగా ఇళ్లకు వచ్చి పొగాకు క్వింటాకు రూ.15 వేల ప్రకారం కొంటామని చెప్పి సాగు చేయించారు. తీరా ఇక్కడకు తెచ్చిన తర్వాత రూ.6 వేల నుంచి రూ.9 వేల వరకు ధర వేస్తున్నారు. పొగాకు కూలీలకు ఒక్కొక్కరికి రోజుకు వెయ్యి రూపాయల వరకు ఇస్తేనే పనికి వస్తున్నారు. వారికున్నపాటి విలువ కూడా రైతులకు లేకుండా పోయింది. వద్దంటే పొగాకు సాగు చేయం కదా? ఎన్నో కిలోమీటర్ల దూరం నుంచి వచ్చి తిరిగి తీసుకెళ్లమంటే రైతు సగం చనిపోయినట్లే. అధికారులు స్పందించి న్యాయం చేయాలి.
– నాగేశ్వరరావు, రైతు

భక్తిశ్రద్ధలతో హనుమాన్ జయంతి


గొట్లగట్టులో పూజలు చేస్తున్న వేద పండితులు

గిద్దలూరు రూరల్: హనుమాన్ జయంతి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని రేడియాబావి సమీపంలో గల అభయాంజనేయస్వామి ఆలయంలో బుధవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు సామూహికంగా పాల్గొని లక్ష తమలపాకుల పూజ చేశారు. విజయవాడకు చెందిన కళాకారులతో భరతనాట్యం, కూచిపూడి నృత్య ప్రదర్శన ఏర్పాటు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలతోపాటు అల్పాహారం అందజేశారు. గురువారం హనుమాన్ శోభాయాత్రను వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

కొనకనమిట్ల మండలంలో..

కొనకనమిట్ల: హనుమాన్ జయంత్యుత్సవాలను మండలంలోని గొట్లగట్టులో అభయవీరాంజనేయస్వామి ఆలయంలో బుధవారం ఘనంగా ప్రారంభించారు. వేదపండితుడు వినుపాముల రామకృష్ణశర్మ ఆధ్వర్యంలో అభిషేకాలు, అర్చనలు చేశారు. గురువారం ఆకుపూజ, హోమాలు, గ్రామోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

నేటి నుంచి ఉత్సవాలు..

మండలంలోని పలు గ్రామాల్లో హనుమాన్ జయంతి ఉత్సవాలను రెండు రోజులపాటు వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. గొట్లగట్టు గ్రామంలోని అభయ వీరాంజనేయస్వామి, కొనకనమిట్ల రామదూత క్షేత్రంలో పంచముఖ ఆంజనేయస్వామి, నాయుడుపేట, పాతపాడు, గరిమినపెంట, చినమనగుండం, సిద్ధవరం, మర్రిపాలెం గ్రామాల్లోని వీరాంజనేయస్వామి ఆలయాలల్లో వేడుకలు నిర్వహిస్తున్నారు.

నగదు రహితంగా ఆస్తి పన్ను వసూలు


పంచాయతీ కార్యదర్శులతో సమీక్షిస్తున్న డీఎల్‌పీఓ భాస్కర్‌రెడ్డి

కొమరోలు: ప్రజల నుంచి ఆస్తి పన్నును నగదు రహితంగా వసూలు చేయాలని పంచాయతీ కార్యదర్శులను మార్కాపురం డీఎల్‌పీఓ మల్లవరపు భాస్కర్‌రెడ్డి ఆదేశించారు. బుధవారం కొమరోలు గ్రామ సచివాలయాన్ని డీఎల్‌పీఓ తనిఖీ చేశారు. మండలంలోని పంచాయతీ కార్యదర్శులతో సమీక్షించి గ్రామాలవారీగా ఇంటి పన్ను వసూలు, పారిశుధ్యం, నీటి సమస్యలు తెలుసుకున్నారు. డీఎల్‌పీఓ మాట్లాడుతూ.. ఇంటి పన్ను నగదు రూపంలో చెల్లించవద్దని, స్వర్ణ పంచాయతీ యాప్ ద్వారా మాత్రమే చెల్లించాలని ప్రజలకు సూచించారు. మండలంలో ఈ ఏడాది 67 శాతం ఇంటి పన్ను వసూలైనట్లు తెలిపారు. బాదినేనిపల్లె, ఇడమకల్లు, ముక్తాపురం, పుల్లారెడ్డిపల్లె, రెడ్డిచెర్ల, సూరవారిపల్లి గ్రామ పంచాయతీల్లో నూరు శాతం ఇంటి పన్ను చెల్లించారని వెల్లడించారు. గ్రామ పంచాయతీల్లో 250 కుటుంబాలకు ఒక గ్రీన్ అంబాసిడర్‌ను నియమించాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. పారిశుధ్య సమస్య, నీటి సమస్య ఎక్కడ ఉన్నా పంచాయతీ కార్యదర్శులే బాధ్యత వహించాలని స్పష్టం చేశారు. సమావేశంలో ఈఓపీఆర్డీ బ్రహ్మయ్య పాల్గొన్నారు.

విద్యార్థులు సమయాన్ని వృథా చేయొద్దు


విద్యార్థులకు స్నేక్ చార్ట్‌లు అందజేస్తున్న దాత

గిద్దలూరు రూరల్:

విద్యార్థులు తమ అమూల్యమైన సమయాన్ని వృథా చేయరాదని విశ్రాంత ఉపాధ్యాయుడు డి.వెంకటేశ్వర్లు సూచించారు. స్థానిక గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా బుధవారం విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. సృజనాత్మకత, నైపుణ్యాన్ని ప్రదర్శించేందుకు ప్రయత్నించాలని సూచించారు. గ్రంథాలయంలో పుస్తక పఠనం విజ్ఞానాన్ని పెంపొందించుకునేందుకు దోహదపడుతుందని తెలిపారు. అనంతరం విద్యార్థులకు విశ్రాంత గ్రంథపాలకుడు ఎం.జయరాంరెడ్డి స్నేక్ చార్ట్‌లు అందజేశారు. కార్యక్రమంలో గ్రంథపాలకురాలు ప్రసన్నకుమారి, రిటైర్డ్ హెచ్ఎం రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్‌లోకి మధుర ఫలం


విక్రయానికి సిద్ధంగా ఉన్న ఉలవపాడు మామిడి పండ్లు

మార్కాపురం:

ఉలవపాడు మామిడి పండ్లకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఏర్పడింది. నాణ్యమైన కాయలు, చెట్టుపై మాగిన కాయలంటూ వ్యాపారులు తమ ప్రచారంతో హోరెత్తిస్తున్నారు. రుచిలో దేశవిదేశాల్లో సైతం పేరొందిన ఉలవపాడు భంగినపల్లి మామిడి పండ్లు ఇప్పుడిప్పుడే మార్కెట్‌లోకి వస్తున్నాయి. మార్కాపురం పండ్ల మార్కెట్‌కు నూజివీడు, నంద్యాల, అనంతపురం, గుంటూరు, ఒంగోలు నుంచి మామిడికాయలు వస్తున్నాయి. రకాన్ని బట్టి కిలో రూ.70 నుంచి రూ.100 విక్రయిస్తుండగా, ఉలవపాడు మామిడి పండ్లను మాత్రం రూ.100కు విక్రయిస్తున్నారు. ధర ఎక్కువైనప్పటికీ ఉలవపాడు మామిడి పండ్లను ప్రజలు ఇష్టపడి కొనుగోలు చేస్తున్నారు.

ఘనంగా సీతారాముల పట్టాభిషేకం

కొనకనమిట్ల: స్థానిక రామదూత క్షేత్రంలో బుధవారం సీతారాముల పట్టాభిషేకం, పూర్ణాహుతి కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. గత ఏడు రోజులుగా రామదూత క్షేత్రంలో ద్వాదశ శ్రీరామనామ సప్తాహ మహోత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. వేద పండితుడు అకలంకం వెంకటరామ కృష్ణాచార్యులు, పురోహితుడు డి.అరుణాచార్యులు ముందుగా హోమాలు, అభిషేకాలు, అర్చనలు చేశారు. కల్యాణ ఉభయదాతలుగా మండలంలోని చినమనగుండం, పాదిలికి చెందిన గొంట్లా కుటుంబ సభ్యులు వ్యవహరించారు. పట్టాభిషేకం అనంతరం భక్తులకు అన్న సంతర్పణ చేశారు. గురువారంతో ఉత్సవాలు ముగుస్తాయని ఆలయ కమిటీ నిర్వాహకుడు యక్కంటి తిరుపతిరెడ్డి తెలిపారు.


సీతారామ పట్టాభిషేకంలో పాల్గొన్న ఉభయదాతలు

గొబ్బూరును సందర్శించిన మహాస్వామి


ప్రత్యేక పూజల్లో మహాస్వామి

పెద్దారవీడు: మండలంలోని గొబ్బూరు గ్రామానికి వచ్చిన శృంగేరి శారదాపీఠాధిపతి విధుశేఖర భారతి మహాస్వామికి పూర్ణకుంభంతో గ్రామ అర్చకులు అరుణకుమార్, భరద్వాజశర్మలు బుధవారం ఘన స్వాగతం పలికారు. మహాస్వామి రాక కోసం రామాలయాన్ని సుందరంగా మామిడి ఆకులు, పూలమాలతో అలంకరించారు. విజయ యాత్రలో భాగంగా గ్రామంలో ఆయన సీతారాములస్వామికి పూజలు చేసి దర్శించుకుని నైవేద్యం చెల్లించారు. అర్చక దంపతులు మహాస్వామి పాద పద్మాలకు జలాభిషేకం చేశారు. అర్చకులు సీతారామచంద్ర స్వామిని పట్టువస్త్రాలు, పూలమాలతో ప్రత్యేకంగా అలంకరించారు. మహాస్వామిని దర్శించుకునేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు వచ్చారు. పూజా కార్యక్రమం అనంతరం విజయ యాత్రలో భాగంగా తిరుగు ప్రయాణమయ్యారు.

ఎన్‌సీసీ విద్యార్థులకు ముగిసిన శిక్షణ


సర్టిఫికెట్లతో ఎన్‌సీసీ క్యాడెట్లు, అధికారులు

ముండ్లమూరు (కురిచేడు): స్థానిక మోడల్ పాఠశాల విద్యార్థులకు ఎన్‌సీసీ శిక్షణ బుధవారంతో ముగిసింది. ఈ నెల 12వ తేదీ నుంచి 34వ బెటాలియన్ కమాండింగ్ అధికారి కె.మోహన్, ఎన్‌సీసీ సుబేదార్ మేజర్ పుష్పరాజులు విద్యార్థులకు ఒంగోలులోని రాజీవ్ గాంధీ ట్రిపుల్ ఐటీ ప్రాంగణంలో పది రోజులు శిక్షణ ఇచ్చారు. విద్యార్థులకు అవసరమైన డ్రిల్స్‌తో పాటు కఠిన శిక్షణను సులభంగా నేర్పించారు. ఉత్తమ విద్యార్థులుగా, ఉత్తమ పౌరులుగా సమాజంలో రాణించేలా శిక్షణ ఇచ్చారు. అధికారులు మాట్లాడుతూ విద్యార్థులకు మంచి క్రమశిక్షణ, నడవడిక, ఐక్యత, దేశభక్తి, భారత్ విశిష్టతను గురించి వివరించారు. ఇలాంటి అవకాశాన్ని అందిపుచ్చుకొని విద్యార్థులందరూ దేశ శ్రేయస్సు కోసం పాటుపడాలని కళాశాల ప్రిన్సిపాల్ పూర్ణచంద్రరావు తెలిపారు. ఎన్‌సీసీ క్యాడెట్లను పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది అభినందించారు. ఎన్‌సీసీ మాస్టర్ సాధు వెంకటేశ్వరరెడ్డి పర్యవేక్షించారు. చివరగా ఎన్‌సీసీ క్యాడెట్లకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.

ఆ కార్యాలయానికి వెళ్లే దారేది?


తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిలిచిన వర్షం నీరు

- రెవెన్యూ కార్యాలయం ఎదుట తటాకం
- రాకపోకలకు ఇబ్బంది పడుతున్న ప్రజలు

దర్శి (కురిచేడు): నియోజకవర్గ కేంద్రం దర్శిలో రెవెన్యూ, పోలీస్, ట్రెజరీ, సబ్‌జైలు కార్యాలయాల సముదాయంలోని ప్రాంగణం చిన్నపాటి వర్షానికి తటాకంలా మారుతుండటంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. బుధవారం సాయంత్రం కురిసిన చిన్నపాటి వర్షానికి ప్రాంగణమంతా నీటితో చేరి తటాకాలుగా మారాయి. బురద నీటి నుంచి కార్యాలయాలకు వెళ్లే కార్యాలయం అంతా బురదమయం అవుతుందని, సిబ్బంది ప్రజలను బయటే ఉంచుతున్నారని, కార్యాలయానికి వెళ్లకుండా, అధికారులకు సమస్యలు చెప్పకుండా ఎలా ఉండాలని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. నగర పాలక సంస్థ అధికారులు వర్షాకాలం కారణంగా ముందస్తు చర్యల్లో భాగంగా లోతట్టు ప్రాంతాల్లో మెరక తోలి నీటి నిల్వలు లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు. నీటి నిల్వలతో అంటు వ్యాధులు ప్రబలే ప్రమాదం పొంచి ఉందని ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే కార్యాలయాల సముదాయంలో నీటి నిల్వలు లేకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


కోలాటం ప్రదర్శిస్తున్న యువతీయువకులు

కోలాటం ప్రదర్శన

కురిచేడు: శ్రీహనుమాన్ జయంతి పర్వదినం సందర్భంగా మండలంలోని కాటంవారిపల్లెలో బుధవారం రాత్రి కోలాటం ప్రదర్శించారు. స్వామి వారికి ముందస్తు జయంతి శుభాకాంక్షలు తెలుపుతూ గ్రామానికి చెందిన శ్రీ పట్టాభి సీతారామ కోలాట బృందం కోలాట ప్రదర్శన ఆంజనేయస్వామి ఆలయం వద్ద నిర్వహించింది. కోలాటం ప్రదర్శనను చుట్టుపక్కల గ్రామాల వారు ఆసక్తిగా తిలకించారు. కోలాటం ప్రదర్శనతో ప్రాచీన కళలను గుర్తు చేయడంతో పాటు వేసిన వారికి ఆరోగ్యం లభిస్తుందని మేధావులు పేర్కొన్నారు. అంతే కాకుండా అందరి మధ్య మంచి సంబంధాలు ఏర్పడతాయని చూసిన వారు చర్చించుకున్నారు.